క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం కుర్చీలు, టేబుళ్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. అలాగే దాతగా వ్యవహరించి పట్టణానికి చెందిన ఫారూక్ మహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పట్వారి తులసి కుమార్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్పాకర్ రావు, సభ్యులు ఆనంద్, హెచ్‌ఎం వెంకట్ నర్సయ్య పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌కు చెందిన సుగుణ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ప్రభుత్వం నుంచి వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.2.5 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ కాపీని శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

బీసీ కుల గణన వెంటనే చేపట్టాలి

వేల్పూర్: బీసీ కుల గణన వెంటనే చేపట్టాలని బాల్కొండ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొండి అశోక్ శనివారం డిమాండ్ చేశారు. బీసీల అభ్యున్నతి అంటే ఎన్నికల ముందు డిక్లరేషన్‌లు ప్రకటించి చేతులు దులుపుకోవడమేనని గత 8 దశాబ్దాలుగా స్పష్టమవుతోందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం రాలేదన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రావాల్సిన ప్రతిఫలాలు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నోట్‌బుక్స్ పంపిణీ



బోధన్: అమ్దాపూర్, ఊటిపల్లి గ్రామాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 150 మందికి ఊటిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు శివప్రసాద్ ఉచితంగా నోట్‌బుక్స్ అందించారు. శనివారం అమ్దాపూర్ ప్రాథమిక పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సూర్యకుమార్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయొద్దు



బోధన్: ఎరాజ్‌పల్లి జీపీ కార్యదర్శి బాలకృష్ణను వేరే చోటకు బదిలీ చేయవద్దని కోరుతూ శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీపీవోలో అధికారికి ఆ గ్రామ ప్రజలు , పలువురు నాయకులు వినతి పత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శిగా ఇక్కడే కొనసాగించాలని కోరారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో ముందుగా 68 అంశాలతో కూడిన ఎజెండాపై సభ్యులు చర్చ జరిపి ఆమోదం తెలిపారు. నగరంలో 60 డివిజన్లకు ప్రత్యేకంగా మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మేయర్ నీతూకిరణ్ పేర్కొన్నారు. ఒక్కో డివిజన్‌కు రూ.10లక్షల చొప్పున మంజూరైనట్లు చెప్పారు.

అవినీతికి కేరాఫ్ మున్సిపల్: ఎమ్మెల్యే

నిజామాబాదు కార్పొరేషన్ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా విమర్శించారు. బడ్జెట్ చూస్తే రూ. కోట్ల కేటాయింపు ఉందని కానీ పనులు అలా జరగడం లేదన్నారు.

నగర అభివృద్ధికి కృషి చేస్తాం: ఎమ్మెల్సీ

నగర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రెండు నెలల్లో సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

ప్రారంభానికి నోచుకోని పాఠశాల

- పెండింగ్‌లో చిన్నాచితకా పనులు
- ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విద్యార్థులు



మాక్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

మాక్లూర్: కొత్తగా నిర్మించిన మాక్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం ప్రారంభానికి సిద్ధమైంది. కొన్ని చిన్న చితక పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రారంభానికి నోచుకోవటం లేదు. ఇప్పటికే ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు రెండు సంవత్సరాలుగా రిక్వెస్టుపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చాలీచాలని గదుల్లో విద్యను కొనసాగిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరమైనా నూతన భవనంలోనికి చేరుకుంటామని ఆశపడిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాల మండల కేంద్రంతో పాటు ముల్లంగి(బి), కృష్ణానగర్, దుర్గానగర్, సింగంపల్లి, మాదాపూర్, గంగరమంద, వేణుకిసాన్‌నగర్ తదితర అనేక గ్రామాల విద్యార్థుల చదువులకు నిలయంగా పేరు గాంచింది. మండలంలోనే అత్యధిక విద్యార్థుల సంఖ్య ఉండే పాఠశాల కూడా ఇదే. సుమారు 500 మంది విద్యార్థులతో కళ కళలాడుతుంది. అయితే పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరటంతో 2 సంవత్సరాల క్రితం కూల్చివేశారు. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4 కోట్ల 70 లక్షల నిధులు మంజూరు చేసింది. అ నిధులకు తోడు నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆయన సోదరుడు ఎన్‌ఆర్‌ఐ బిగాల మహేష్ గుప్తాలు కలిసి వారి తండ్రి బిగాల క్రిష్ణమూర్తి జ్ఞాపకార్థం రూ.కోటి విరాళం అందించారు. అవసరమైతే మిగిలిన చిన్న చితక పనులకు కూడ తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఫిబ్రవరి 17, 2022లో కొత్త భవనం నిర్మాణానికి భూమి పూజ చేసి కార్పొరేట్ పాఠశాలను తలపించే విధంగా నిర్మించారు. అంతర్గతంగా ప్లంబింగ్, మరుగుదొడ్లు ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం పనులు ముందుకు సాగటంలేదు. ఫలితంగా విద్యార్థులు, తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అలసత్వం వీడి మిగిలి ఉన్న పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి

నిర్మాణం పూర్తయిన కొత్త పాఠశాల భవనంలో ఇంకా మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించాలి. విద్యార్థులు నష్టపోతున్నారు. జూనియర్ కళాశాల భవనంలో సాగుతున్న తరగతుల వల్ల విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది. పూర్తి స్థాయిలో విద్యాబోధన అందటం లేదు. ఇప్పటికైనా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలి.

– తిరుమల నరేష్ గౌడ్ (మాక్లూర్)

విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది

నూతన పాఠశాల నిర్మాణం పనులు పూర్తికాకపోవటం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఇప్పటికే 2 సంవత్సరాలుగా తరగతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్నాయి. అరగంటకో క్లాసు, ఒంటి పూట బడి వల్ల 400 ఉన్న విద్యార్థుల సంఖ్య 200కు పడిపోయింది. బిల్డింగ్ పూర్తయినందున కాంట్రాక్టర్ మిగితా మరుగు దొడ్లు ఇతర పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలి.

– రాజగంగారెడ్డి, విద్యాధికారి, మాక్లూర్

లిఫ్టుల అభివృద్ధికి నిధులివ్వండి



వినతిపత్రం ఇస్తున్న వినయ్ రెడ్డి, లిఫ్టుల చైర్మన్లు

డొంకేశ్వర్/నందిపేట(ఆర్మూర్): లిఫ్టుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ డొంకేశ్వర్, నందిపేట పరిధిలోని ఎత్తిపోతల చైర్మన్లు శనివారం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, లిఫ్టుల కమిటీ అధ్యక్షుడు మోర్తాడ్ భోజారెడ్డిలు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో లిఫ్టులను మంజూరు చేయడం వల్ల పంటలు సమృద్ధిగా పండుతున్నాయని తెలిపారు. మధ్యలో వచ్చిన ప్రభుత్వాలు ఎత్తిపోతలను పెద్దగా పట్టించుకోలేదని, దీంతో మోటార్లు, పైపులైన్లు, కాలువలకు రిపేర్లు ఏర్పడడంతో రైతులే డబ్బులు వేసుకుని మరమ్మతులు చేసుకుంటున్నారని తెలిపారు. నిధులు కేటాయించి, కొత్త మోటార్లు మంజూరు చేయాలని కోరారు. ఇందులో లిఫ్టుల కమిటీ ఉపాధ్యక్షుడు సుంకరి రాజు, కార్యదర్శి ఓంకార్, తదితరులున్నారు.

ఎమ్మెల్యే పోచారం వెంటే ఉంటాం



రుద్రూర్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

రుద్రూర్: కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంటే ఉంటామని మండల బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని హర్షిస్తున్నామని అన్నారు. ఎప్పుడూ రైతుల సంక్షేమం కోసం ఆలోచించే పోచారం సేవలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వచ్చి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని అన్నారు. ఎమ్మెల్యే పోచారం నిర్ణయానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, రైతు బంధు అధ్యక్షుడు తోట సంగయ్య, మాజీ సర్పంచ్ సర్పంచ్‌లు రామాగౌడ్, ఖాదర్, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, ఏఎంసీ మాజీ చైర్మన్ సంజీవులు, నాయకులు నేరుగంటి బాల్‌రాజ్, మొద్దుల నర్సయ్య, హన్మంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



కూనేపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో ఉష

రెంజల్/ఎడపల్లి(బోధన్): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని జెడ్పీ సీఈవో ఉష పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని కూనేపల్లి జెడ్పీ, ఉన్నత పాఠశాలల్లో, ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం, బాపు నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. కమిటీ ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనుల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలను అందించేందుకు అవసరమై నిధులను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించేందుకు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం రెంజల్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవోలు శ్రీనివాస్, శంకర్, ప్రధానోపాధ్యాయులు అనురాధ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు అండగా ఉంటారు



శంకుస్థాపన చేస్తున్న మానాల మోహన్ రెడ్డి

భీమ్‌గల్: కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. దేవక్కపేట్ గ్రామంలోని హరిసింగ్ నాయక్ తండాలో ప్రజలకు నీటి సౌకర్యార్థం కాంగ్రెస్ నాయకులు తమ సొంత డబ్బులతో నిర్మించ తలపెట్టిన మినీ వాటర్ ట్యాంక్‌కు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులను గుర్తించి సొంత డబ్బులతో వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తున్న దేవక్కపేట్ కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లాలోని అన్ని గ్రామాల కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారన్నారు. మిని ట్యాంక్ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకుడు మాలావత్ రవి, తదితరులున్నారు.

డీవీకే వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ



చందూర్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతలు



ఆర్మూర్ పట్టణంలో..

జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించబోయే కామ్రేడ్ డీవీ కృష్ణ రెండో వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు, ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. జిల్లాలో పలు చోట్ల రెండో వర్ధంతి పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కామ్రేడ్ డీవీకే నేటి విప్లవతరానికి మార్గదర్శకుడని, ఈ నెల 26న జిల్లా కేంద్రంలో డీవీకే స్మారకస్తూపాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



పోచారం గ్రామంలో ..



భీమ్‌గల్‌లో..

సమాచారం..

27న తైబజార్ వేలం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట జీపీ కార్యాలయంలో ఈ నెల 27న తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు ఎంపీవో కిరణ్ కుమార్ తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను వార సంత, రోజువారీ మార్కెట్‌కు గురువారం ఉదయం 11 గంటలకు నందిపేట జీపీ కార్యాలయంలో వేలంపాట ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు వారపు సంతకు రూ.50 వేలు రోజువారీ సంతకు రూ. 30వేల డిపాజిట్లు ఉదయం 10 గంటల లోపు చెల్లించాలని తెలిపారు. గతంలో బకాయిలు ఉన్నవారు వేలంపాటలో పాల్గొనటానికి అనర్హులని పేర్కొన్నారు. మిగతా షరతులకు నందిపేట జీపీ కార్యాలయం బాధ్యత వహిస్తుందని ఎంపీవో కిరణ్ కుమార్, కార్యదర్శి వినయ్ కుమార్ తెలిపారు.

ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఔట్ సోర్సింగ్‌లో పని చేయడానికి ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్ శనివారం తెలిపారు. జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా కనీసం మూడు సంవత్సరాల అనుభవంతో పాటు ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను నేరుగా కళాశాలకు వచ్చి సమర్పించాలని సూచించారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శనివారం పరిశీలించారు. కల్వర్టు పనులను నాణ్యతతో పాటు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను చైర్‌పర్సన్ పరిశీలించారు. అర్హులైన వారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భూమేష్, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, అతిక్, జహీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రైతులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన 'ధరణి' సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖిగా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ తప్పిదంతో రైతులు ఇబ్బందుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి సమస్యలను పరిష్కరించుకునేందుకు చేసిన దరఖాస్తుల్లో జిల్లా వ్యాప్తంగా 46,746 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలతో కలిసి 40,271 దరఖాస్తులకు పరిష్కారం చూపించామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 6,675 దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ఈ సందర్భంగా ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎంపీడీవో నాగనాథ్, తహసీల్దార్ నారాయణ, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 2 లక్షల రుణమాఫీ 'రైతు పండగ'

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2 లక్షల రుణమాఫీపై గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం'రైతు పండగ' అని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ హామీ ఎట్టకేలకు సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశారు. పంటల సాగుకు అప్పు చేసిన రైతులు ఏ చింతా లేకుండా ఆనందంగా వ్యవసాయం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు వెలకట్టలేనివి



వృద్ధాశ్రమ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎడపల్లి(బోధన్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన వయోవృద్ధుల ఆశ్రమంలో మొదటి అంతస్తును ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో ప్రతి ఒక్కరికి వృద్ధాప్య దశ తప్పదని, ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు ఒకచోట, పెద్దలు ఇంకో చోట ఉండాల్సి వస్తుందని దీనికి పరిష్కారం వృద్ధాశ్రమాలేనని అన్నారు. దూరదృష్టితో ఆలోచించి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాలు నిర్మించడం అభినందనీయం అన్నారు. తన వంతుగా భవనానికి రూ.10 లక్షలు ప్రకటించారు. అవసరమైతే మరిన్ని నిధులు అందజేస్తామన్నారు. భవన నిర్మాణానికి భూమి ఇచ్చిన కొత్తపల్లి శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.లక్ష్మి, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, ప్రతినిధులు బసవేశ్వర రావు, కొడాలి కిశోర్, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, కదం ప్రకాష్ రావు, మెర్సి, మనోజ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందన్, ఎడపల్లి సింగిల్ విండో చైర్మన్ పోల మల్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్‌లో ఫిట్‌నెస్ లేని ప్రైవేటు పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు శనివారం ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేని బస్సుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంవీఐని కోరారు. నాయకులు మహేష్ వర్ధన్, సాయి, అర్జున్ పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని వరద పాయసం



బాల్కొండ: వర్షాలు సమృద్ధిగా కురువాలని వీడీసీ ఆధ్వర్యంలో బాల్కొండ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం వరద పాయసం సమర్పించారు. ప్రతి సంవత్సరం ఆలయంలో వరద పాయసం సమర్పిస్తామని వీడీసీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఈవో గోవర్ధన్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో శనివారం వైద్యశాఖ సిబ్బంది పర్యటించి స్థానికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కోటగిరి ఉమ్మడి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో 16, 17 వార్డుల్లో లార్వాలను గుర్తించి తొలగించారు. ప్రతి రోజు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.

వివేకానంద హైస్కూలులో..

కోటగిరి మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్ విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించారు. దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియపరిచారు. హెల్త్ సూపర్ వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్స్ రోజా, శ్రీదేవి, మంజుల, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి రాకేశ్

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సిన్‌పై శనివారం వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాకేష్ మాట్లాడుతూ.. టీబీ నివారణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్‌ను 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు వేయించుకోవాలన్నారు. జులై ఆఖరి వారంలో లేదా ఆగష్టు మొదటి వారం నుంచి వ్యాక్సిన్ ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో టీబీ కో–ఆర్డినేటర్ మధుగౌడ్, హెల్త్ ఎడ్యుకేటర్ మురళి, సూపర్ వైజర్ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హరోంహర (తెలుగు) – 12.00, 6.30 మనమే (తెలుగు)–3.15, 9.45 ఓ మైగాడ్ (తెలుగు) – 9.45
స్క్రీన్-2 –	మహారాజ (తెలుగు) – 12.45, 3.50, 6.55, 10.00
స్క్రీన్-3 –	ఓమైగాడ్ (తెలుగు) – 1.20, 6.45 నింద(తెలుగు)– 4.05, 9.30
స్క్రీన్-4 –	ఓ మైగాడ్ (తెలుగు) – 11.55, 3.10 ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు) – 6.25, మరణం(తెలుగు)– 9.15

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



వేంపల్లిలో పాలాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు



తాడ్‌బిలోలిలో పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

రైతులకు రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో పంట రుణమాఫీ చేస్తామని మంత్రి వర్గంతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ జిల్లాలో పలు చోట్ల శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పార్టీ నిలబెట్టుకుందని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్